సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025


విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించండి 8లో


గాలుల బీభత్సానికి జూ పార్కు విలవిల 8లో


పాతికేళ్ల నృత్య పండగ 8లో

బాలల భద్రత, సంరక్షణకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న న్యాయమూర్తి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: బాలల సంరక్షణ, భద్రత అత్యంత ప్రాధాన్య అంశాలని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు సంబంధించిన పోలీసు, బాలల సంరక్షణ చట్టం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో న్యాయమూర్తి ప్రసంగించారు. బాలలకు సంబంధించి ఇటీవల నేరాల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులకు భద్రత కల్పించడం, వారి ఆరోగ్యం, సంక్షేమం కీలకంగా చూడాలన్నారు. జువనైల్ సంక్షేమ పోలీస్ యూనిట్, బాలల సంక్షేమ కమిటీ, పోక్సో చట్టం, బాలలపై జరిగే లైంగిక నేరాల తీవ్రత, ప్రత్యేక భద్రతా వ్యవస్థ వంటి కమిటీల ప్రాధాన్యం, పని తీరు, ప్రభుత్వ సంస్థల చొరవ వంటి అంశాలపై న్యాయమూర్తి మాట్లాడారు. బాలల నేరాల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం, సంబంధిత సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విశాఖ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.రామలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా అందుకు సంబంధించిన సంస్థలు బాధ్యత వహించి, అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నర్సీపట్నం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్, చోడవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ, విశాఖ జిల్లా ప్రొబిషన్ అధికారి జి.శ్రీధర్, బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, జువనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యుడు పి.సూర్య భాస్కరరావు, బాలల సంక్షేమ బోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంటోళ్ల నిర్లక్ష్యం!

- ఈపీడీసీఎల్ సిబ్బంది బాధ్యతారాహిత్యం
- 11 సర్కిళ్ల పరిధిలో 37,749 విద్యుత్ కనెక్షన్లకు తప్పుగా ఆధార్ సీడింగ్
- ఒకే ఆధార్‌తో 500 ఇళ్లకు అనుసంధానం
- విశాఖ సర్కిల్ పరిధిలోనే అత్యధికంగా 4,012 కేసులు
- విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో బహిర్గతం

విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ సీడింగ్ అస్తవ్యస్తం

సాక్షి, విశాఖపట్నం: కరెంట్ బిల్లు కట్టకపోతే.. సామాన్యుల ఇళ్లని చీకటిమయం చేసే విద్యుత్‌శాఖ.. తాము చేసిన తప్పుల్ని మాత్రం కప్పిపుచ్చుకోవాలని యత్నిస్తుంది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 37 వేల మంది విద్యుత్ కనెక్షన్ల ఆధార్ సీడింగ్‌ని తప్పుగా నమోదు చేసేసింది. ఫలితంగా దాదాపు 90 శాతం మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైపోయారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చేసిన పరిశీలనల్లో.. ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి బట్టబయలైంది. ఒకే ఒక్క ఆధార్ నంబర్‌ని ఏకంగా 500 ఇళ్లకు అనుసంధానం చేసేశారు. ఇలా.. ఒక ఆధార్ నంబర్‌ని 10 నుంచి 500 ఇళ్లకు సీడింగ్ చేస్తూ.. అడ్డగోలుగా వ్యవహరించారు. నెలరోజుల్లో తప్పులు సరిదిద్దాలంటూ సీజీఆర్ఎఫ్ ఈపీడీసీఎల్‌కు హెచ్చరిక జారీ చేసింది.


ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

11 సర్కిళ్ల పరిధిలో 37,749 ఇళ్లకు తప్పుడు సీడింగ్.!

ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, రాజమహేంద్రవరం, పశ్చిమ గోదావరి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని కొందరు వినియోగదారులు సీజీఆర్ఎఫ్‌కు గత కొద్ది నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నారు. తాము అర్హులమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని.. విద్యుత్ బిల్లుల కారణంగానే జరుగుతోందని సచివాలయంలోనూ, మండల కార్యాలయాల్లో చెబుతున్నారంటూ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీనిపై సీజీఆర్ఎఫ్ ఆరా తీసింది. సీజీఆర్ఎఫ్ చైర్మన్ విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ అధ్యక్షతన సభ్యులు ఎస్.రాజాబాబు(టెక్నికల్), ఎస్ మురళీకృష్ణ(ఇండిపెండెంట్) క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేశారు. ఆగస్టు 19న తుది విచారణ పూర్తి చేశారు. మొత్తం తమ పరిశీలనలో విస్తుపోయేలా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్య వైఖరికి అద్దంపట్టే అంశాలు బట్టబయలయ్యాయి. ఆగస్టు 19 నాటికి ఈపీడీసీఎల్ పరిధిలోని 11 సర్కిళ్లలో 37,749 విద్యుత్ కనెక్షన్లకు తప్పుగా ఆధార్ సీడింగ్ జరిగిందని తేలింది. పరిశీలన సమయంలో సర్కిళ్ల ఎస్ఈలు పాల్గొని సీడింగ్ ప్రక్రియలో లోపాలను స్పెషల్ డ్రైవ్ ద్వారా సరిదిద్దే ప్రక్రియ నిర్వహించారు.

విశాఖ సర్కిల్‌లో 2 ఆధార్లతో 1000 ఇళ్లకు సీడింగ్!

విద్యుత్ కనెక్షన్లను ఆధార్ సీడింగ్ చేయాలంటే ఇంటింటికీ వెళ్లి ఆధార్ నంబర్‌ని సేకరించడం.. లేదా ఫోన్ ద్వారా సేకరణ ప్రక్రియ చేపట్టడం చేయాల్సి ఉంది. కానీ ఈపీడీసీఎల్‌లోని కొంతమంది సిబ్బంది తమ వద్ద ఉన్న కనెక్షన్ల ప్రకారం.. అందులో ఉన్న ఆధార్ నంబర్లను సేకరించి.. సీడింగ్ ప్రక్రియని అడ్డగోలుగా చేసేశారు. కొన్ని చోట్ల ఒకే ఆధార్ నంబర్‌ని 500కి పైగా విద్యుత్ కనెక్షన్లకు సీడింగ్ చేసేశారు. కొన్ని ఆధార్ నంబర్లను 10, 20, 100, 400.. ఇలా.. తమకు నచ్చినట్లుగా అనుసంధానం చేసేసి.. చేతులు దులిపేసుకున్నారు. ఫలితంగా పరిమితికి మించి విద్యుత్ వినియోగించకున్నా లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమైపోయారు. కొన్ని సర్కిళ్ల పరిధిలో ఒకే ఆధార్ నంబర్‌తో 500 ఇళ్ల విద్యుత్ కనెక్షన్లను సీడింగ్ చేసేశారంటే.. ఎలా కళ్లుమూసుకొని పనిచేశారో అర్థం చేసుకోవచ్చు. సీజీఆర్ఎఫ్ హెచ్చరికలతో అప్రమత్తమైన విద్యుత్‌సిబ్బంది దిద్దుబాటు ప్రక్రియ చేపడుతున్నారు. 37,749 కనెక్షన్లలో ఇంకా 13,572 కనెక్షన్లు సరిచేయాల్సి ఉంది. నెల రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటూ సీజీఆర్ఎఫ్ తీర్పునిచ్చింది.

ఈపీడీసీఎల్ పరిధిలో ఆధార్ సీడింగ్‌లో లోపాలు

ఒకే ఆధార్‌ని 500కిపైగా ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	3
ఒకే ఆధార్‌ని 401 నుంచి 500 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	3
ఒకే ఆధార్‌ని 301 నుంచి 400 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	10
ఒకే ఆధార్‌ని 201 నుంచి 300 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	14
ఒకే ఆధార్‌ని 101 నుంచి 200 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	77
ఒకే ఆధార్‌ని 51 నుంచి 100 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	245
ఒకే ఆధార్‌ని 10 నుంచి 50 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	13,220
మొత్తం కేసులు	-	13,572

విశాఖపట్నం సర్కిల్‌లో...

ఒకే ఆధార్‌ని 500కిపైగా ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	2
ఒకే ఆధార్‌ని 401 నుంచి 500 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	2
ఒకే ఆధార్‌ని 301 నుంచి 400 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	5
ఒకే ఆధార్‌ని 201 నుంచి 300 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	3
ఒకే ఆధార్‌ని 101 నుంచి 200 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	20
ఒకే ఆధార్‌ని 51 నుంచి 100 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	59
ఒకే ఆధార్‌ని 10 నుంచి 50 ఇళ్లకు సీడింగ్ చేసిన కేసులు	-	3,921
మొత్తం కేసులు	-	4012

తప్పులు సరిచేశాక నివేదిక ఇవ్వాలని ఆదేశాలు



ఏపీఈపీడీసీఎల్ డేటాబేస్‌లో వివిధ కారణాల వల్ల కొన్ని విద్యుత్ సర్వీస్‌ల ఆధార్ సీడింగ్‌లో తప్పులు దొర్లాయి. ఆధార్ సీడింగ్ తప్పుగా జరగడం వల్ల చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలను దక్కించుకోలేకపోయారు. నష్టపోయిన విద్యుత్ వినియోగదారులు సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించి నష్టపరిహారం, న్యాయం పొందవచ్చు. ప్రతి ఒక్కరూ గోప్యత హక్కు కూడా కలిగి ఉన్న నేపథ్యంలో వినియోగదారుల అనుమతి, సంతకం లేదా వేలి ముద్ర తప్పనిసరిగా తీసుకుని ఆధార్ నెంబర్‌ను విద్యుత్ సర్వీస్ కనక్షన్‌కు అనుసంధానం చేయాలి. తప్పులు సరిచేయాలని ఆదేశించాం. సరిచేసిన తర్వాత నివేదికలు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులకు స్పష్టం చేశాం.

బి.సత్యనారాయణ, విశ్రాంత జడ్జి, సీజీఆర్ఎఫ్ చైర్మన్

బాధిత వినియోగదారులకు పరిహారం ఇవ్వాలి



ఆధార్ సీడింగ్ తప్పిదాలను రియల్ టైమ్ సాంకేతికతతో సరిచేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సీడింగ్ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడం లేదు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆధార్ సీడింగ్ వల్ల నష్టపోయిన వినియోగదారులకు పరిహారం ఇవ్వాలి. ఇప్పటికే సీజీ నెం. 235/2024 కేసులో బాధితులకు నష్టపరిహారం మంజూరైంది. ఆధార్ అనుసంధానంలో పారదర్శకత తప్పనిసరిగా ఉండాలి. సీజీఆర్ఎఫ్ తీర్పు బాధ్యతరాహిత్యం.. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందికి చెంపపెట్టులాంటిది.

–కాంద్రేగుల వెంకటరమణ, కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

చంద్రబాబు పథకాలన్నీ కాపీ పేస్ట్

- ఉత్తరాంధ్ర వనరులను దోచుకుంటున్నారు
- అమరావతిపై ప్రేమతో ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారు
- స్పీకర్ పదవికి అయ్యన్న అనర్హుడు
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం
- వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు అమర్‌నాథ్, కేకే రాజు


మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్. చిత్రంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల, చింతలపూడి

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో కలిపి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. సొంతంగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని వైఎస్సార్ సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, పొరుగు రాష్ట్రాల పథకాలను ఆయన కాపీ పేస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు స్పష్టం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి నేతలు ఉత్తరాంధ్ర వనరులను కొల్లగొడుతున్నారని, విశాఖలో సదస్సులు నిర్వహించి, పెట్టుబడులను మాత్రం అమరావతికి తరలిస్తున్నారని ఆరోపించారు. అమరావతిపై ఉన్న ప్రేమతో చంద్రబాబు ఉత్తరాంధ్రపై వివక్ష చూపుతూ.. ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాట పట్టిన ఉత్తరాంధ్ర.. నేటి కూటమి పాలనలో భ్రష్టుపట్టిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరాటం

పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని, వాటిలో పది కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందని అమర్‌నాథ్, కేకే రాజు మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 9న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వైద్య కళాశాలను సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలిస్తారని వారు వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నవి అర్థం లేని మాటలు

స్పీకర్ పదవికి అయ్యన్నపాత్రుడు అనర్హుడని అమర్‌నాథ్, కేకే రాజు అన్నారు. 'అయ్యన్నలో కనీసం ఒక్క మంచి లక్షణం కూడా లేదు. అబద్ధాలు, అర్థం లేని మాటలు మాట్లాడటం ఆయన నైజం' అని విమర్శించారు.

నేడు వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని చెన్నా కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు అమర్‌నాథ్, కేకే రాజు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. మూలపేట పోర్ట్, భోగాపురం ఎయిర్ పోర్ట్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అరకు ఎంపీ జి.తనూజా రాణి, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు హాజరవుతారని తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

తగరపువలస: పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగే వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం ఏర్పాట్లను శనివారం విశాఖ, అనకాపల్లి జిల్లాల పార్టీ అధ్యక్షులు కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తైనాల విజయకుమార్, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య తదితరులు పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్రెడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, షిణగం దామోదరరావు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు షిణగం రాంబాబు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు తదితరులు

ఎవరికి వారే!

- విద్యుత్ ఉద్యోగుల సంఘాల జేఏసీలో గ్రూపులు
- 6న 'చలో కార్పొరేట్ కార్యాలయం' నిర్వహణ అనుమానమే.!

సాక్షి, విశాఖపట్నం: డిమాండ్లు పరిష్కరించుకునేందుకు ఆందోళన కార్యక్రమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామంటూ అడుగులు వేసిన విద్యుత్ ఉద్యోగుల సంఘాల జేఏసీ.. ఇప్పుడు కాస్తా మెతకపడింది. వివిధ సంఘాల ప్రతినిధుల మధ్య పొంతన లేక.. ఆందోళన కార్యక్రమాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. తొలిదశ ఉద్యమాన్ని ఎలాగోలా నెట్టుకొచ్చేశారు. కానీ.. ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ 6న తలపెట్టిన 'చలో కార్పొరేట్ కార్యాలయం' కార్యక్రమం విషయంలో అన్ని సంఘాలను భాగస్వామ్యం చేయడంలో జేఏసీ నేతలు విఫలమయ్యారు. ఫలితంగా కొన్ని సంఘాలు ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టేందుకు సిద్ధమవుతున్నాయి. కొందరు ఉద్యోగులయితే జేఏసీ ప్రతినిధుల వైఖరిపై మండిపడుతున్నారు. ఇంజినీరింగ్ అసోసియేషన్, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విముఖత చూపిస్తున్నారు. మరోవైపు 6వ తేదీ నుంచి జరిగే దశలవారీ నిరసన, ధర్నా కార్యక్రమాల్లో తాము పాల్గొనడం లేదంటూ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డిస్కమ్ అధ్యక్షుడు బీఎం నాయుడు ప్రకటించారు. తమ సభ్యులు అత్యవసర సేవల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నందున జేఏసీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న అన్ని సంఘాల్ని ఒకే గొడుగు కింద తీసుకురావడంలో డిస్కమ్ పరిధిలోని జేఏసీ నేతలు విఫలమయ్యారంటూ కొన్ని సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. మరోవైపు కార్పొరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు ఉన్నతాధికారులు అనుమతి తిరస్కరించారు. దీంతో కొందరు ఉద్యోగులు కేసులు పెడతారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈపీడీసీఎల్‌లో సెలవుల రద్దు

ఈపీడీసీఎల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఆదివారం నుంచి సెలవు రద్దు చేస్తున్నట్లు సంస్థ కార్పొరేట్ కార్యాలయం శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే సెలవులు తీసుకున్న వారంతా సోమవారం నాటికి విధుల్లో చేరాలని స్పష్టం చేసింది. విద్యుత్ ఉద్యోగుల సంఘాల జేఏసీ 6న చలో కార్పొరేట్ కార్యాలయం కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది.

నకిలీ ఏసీబీ అధికారులతో జాగ్రత్త

విశాఖ సిటీ: అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారుల పేరుతో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేస్తూ మోసం చేస్తున్నారని, అటువంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో కొంత మంది ఏసీబీ అధికారుల పేర్లను ఉపయోగించుకుని ఫోన్‌కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ, బెదిరిస్తున్నారని తెలిపారు. ఇటువంటి ఫోన్‌కాల్స్‌ను నమ్మొద్దని చెప్పారు. ఏసీబీ అధికారులు ఫోన్ ద్వారా డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు అడగరని తేల్చి చెప్పారు. ఏసీబీ పేరుతో డబ్బు అడిగే వారు పూర్తిగా మోసగాళ్లను స్పష్టం చేశారు. అలాంటి ఫోన్‌కాల్స్‌పై ప్రభుత్వ ఉద్యోగులు స్పందించవద్దన్నారు. అటువంటి వారిపై తక్షణమే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలాగే ఏసీబీ అధికారులకు కూడా తెలియజేయాలన్నారు. వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'ఆటో డ్రైవర్ల సేవలో' ప్రారంభం


లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి దోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

బీచ్‌రోడ్డు: 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం కింద జిల్లాలో 22,955 మంది ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.34.43 కోట్ల లబ్ధి చేకూరిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం కింద ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందిస్తామన్నారు. భీమిలి నియోజకవర్గంలో 5,892 మందికి, విశాఖ తూర్పులో 3,457, పశ్చిమలో 2,212, విశాఖ దక్షిణలో 2,358, ఉత్తరలో 2,563, గాజువాకలో 3,283, పెందుర్తిలో 3,190 మంది డ్రైవర్లకు ఈ పథకం కింద లబ్ధి చేకూరిందన్నారు. అర్హత ఉండి కూడా ఈ పథకం వర్తించని వారు సచివాలయం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పలువురు కార్పొరేటర్లు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ కళింగలో సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య


బాజీ బాబా సాహిక్(ఫైల్)

కొమ్మాది: బీచ్ రోడ్డులోని ఐఎన్ఎస్ కళింగలో శనివారం సాయంత్రం ఒక సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరుకు చెందిన బాజీ బాబా సాహిక్ (44) ఇక్కడ డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా.. సాహిక్ తన వద్దనున్న సర్వీస్ తుపాకీతో గొంతు వద్ద కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆయన ఆత్మహత్యకు గల కారణాలు, ఇతర వివరాలు ఇంకా తెలియరాలేదు. నేవీ అధికారులు ఫిర్యాదు మేరకు భీమిలి సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరు 19 నుంచి క్రెడాయ్ ఎక్స్‌పో



వివరాలు వెల్లడిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో డిసెంబరు 19 నుంచి మూడు రోజుల పాటు క్రెడాయ్ 11వ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. క్రెడాయ్ విశాఖ చైర్మన్ ధర్మేందర్ వరదా, అధ్యక్షుడు ఈ.అశోక్ కుమార్, కార్యదర్శి వి.శ్రీను, సంయుక్త కార్యదర్శి/కార్యక్రమ కన్వీనర్ సీహెచ్.గోవిందరాజు నగరంలోని ఒక హోటల్‌లో శనివారం మీడియాకు ఈ వివరాలను వివరించారు. ఈసారి కూడా బ్యాంకులు రుణాలిచ్చేందుకు ముందుకొచ్చాయని, వినియోగదారుల సౌకర్యార్థం నిర్మాణ సామగ్రి, అధునాతన ఇంటీరియర్ తదితర వివరాలను ఈ ఎక్స్‌పో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 వల్ల వినియోగదారులకు ఎంతో ఉపయోగం ఉంటుందని క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు. సిమెంట్‌పై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. కంపెనీలు ధరల్ని పెంచి జీఎస్టీ తగ్గించామని చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదానంలో అపశ్రుతి

- భక్తులపై పడిన వేడి గంజి
- 20 మందికి గాయాలు
- ప్రాణాపాయం లేదన్న వైద్యులు

దాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని జాలరిపేటలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వేడి గంజి పడిన ఘటనలో చిన్నారులు, వృద్ధులు సహా 20 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జాలరిపేట పిల్లా అప్పయ్యమ్మ కాలనీలో వీర్రాజు శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం అమ్మవారి నిమజ్జనం నేపథ్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమం ఇరుకైన ప్రదేశంలో జరగడం, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. నిర్వాహకులు అదనంగా అన్నం వండటానికి గ్యాస్ స్టవ్‌పై పెద్ద పాత్రలో నీటిని మరిగించి బియ్యం వేశారు. అయితే స్టవ్ స్టాండు సరిగ్గా లేకపోవడంతో మరుగుతున్న నీటితో(ఎసరు) ఉన్న ఆ పాత్ర ఒరిగిపోయింది. అన్న ప్రసాదం కోసం క్యూలో ఉన్న చిన్నారులు, మహిళలు, వృద్ధుల కాళ్లపై గంజి నీళ్లు పడి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు.. క్షతగాత్రులను హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. వీరిలో 18 మందికి స్వల్ప గాయాలు (2–3 శాతం కాలిన గాయాలు) కావడంతో.. ప్రథమ చికిత్స అందించి, మందులు ఇచ్చి డిశ్చార్జ్ చేశారు. అయితే.. పి.నక్షత్రలహరి (5), పి. ధనుష్(8) అనే ఇద్దరు చిన్నారులకు 20 శాతం కాలిన గాయాలవడంతో వారిని ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారెవరికీ ప్రాణాపాయం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రావు తెలిపారు.


ఘటన జరిగిన ప్రాంతమిదే..


అత్యవసర వార్డులో పరిస్థితి సమీక్షించి, వైద్యులకు ఆదేశాలిస్తున్న సూపరింటెండెంట్ వాణి


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

క్లుప్తంగా

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ లీగ్‌ల విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం శనివారం వైఎస్సార్ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఒకటో డివిజన్ విజేతగా ఇస్పత్ క్రికెట్ క్లబ్, రన్నరప్‌గా మెట్రో క్రికెట్ క్లబ్, రెండో డివిజన్ విజేతగా వైజాగ్ వెటరన్స్ సీసీ, రన్నరప్‌గా వైజాగ్ కోల్ట్స్ సీసీ, మూడో డివిజన్ విజేతగా ఉషోదయ క్రికెట్ క్లబ్, రన్నరప్‌గా సిటీ క్రికెట్ క్లబ్, నాలుగో డివిజన్ విజేతగా మెజిస్టిక్ సీసీ, రన్నరప్‌గా గౌరీ యూత్ సీసీ, ఐదో డివిజన్ విజేతగా పెంటమాంబ సీసీ, రన్నరప్‌గా కోల్ట్స్ సీసీ నిలిచాయి. ఆరో డివిజన్ విజేతగా ఆచార్య సీసీ, రన్నరప్‌గా శ్రీగణేష్ సీసీ, ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేతగా సిటీ పోలీస్ జట్టు, రన్నరప్‌ను ఏపీఈపీడీసీఎల్ జట్టు సాధించాయి. ఆయా డివిజన్ల నుంచి ఆల్‌రౌండర్లుగా దీపక్‌కుమార్, సయిర్‌జోగి, వంశీనారాయణ, సిద్ధార్థ్, అవినాష్, జస్‌బీర్ సింగ్, అభిషేక్‌లు నిలిచారు. బెస్ట్ బ్యాటర్లుగా ప్రసాద్, శ్యామ్‌సాయి, అనిల్‌కుమార్, విక్రాంత్, సునీల్, సతీష్, గౌతమ్, బెస్ట్ బౌలర్లుగా సోమేశ్వరరావు, మోహ్సిన్, విజయ్‌కుమార్, సూర్యప్రకాష్, రంజిత్‌కుమార్, రామారావు, త్రినాథ్ నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమానికి నగర సీపీ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహు మతులు, వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందించారు. వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, సంఘం ప్రతినిధులు పార్థసారథి, ఆర్‌కే ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి మందుగుండు సామగ్రి స్వాధీనం

ఐదుగురు నిర్వాహకుల అరెస్టు

అల్లిపురం: నగరంలో పలు ప్రాంతాల్లో దీపావళి మందుగుండు అక్రమ నిల్వ కేంద్రాలపై టాస్క్‌ఫోర్సు పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. పెందుర్తి, ఆనందపురం, ఎంవీపీ కాలనీ, గోపాలపట్నం, భీమిలి పరిధిలో పలు ఇళ్లలోను, గోడౌన్లలో దాడులు చేపట్టారు. బాణసంచా తయారీకి సిద్ధం చేసిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

అట్రాసిటీ కేసుల్లో పరిహారం తక్షణం చెల్లించాలి


మహారాణిపేట: అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం తక్షణం చెల్లించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ కోరారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన 3వ విడత జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. నైపుణ్య శిక్షణ వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.రామారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించండి

- బల్క్‌డ్రగ్ పార్కును ఆపండి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం



జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ బాబూరావు

మహారాణిపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజల జీవనాడి అని, దానిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తాను ఈ అంశాన్ని ఇప్పటికే మూడు సార్లు రాజ్యసభలో ప్రస్తావించానని, కేంద్ర ఉక్కు మంత్రి కూడా తనకు లేఖ రాశారని గుర్తుచేశారు. కేంద్రం ప్రస్తుతం సీఎం చంద్రబాబు మద్దతుపై ఆధారపడి ఉన్నందున, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని ఎంపీ డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, పైల సన్యాసి రాజు, పెంటకోట స్వామి సత్యనారాయణ తొలుత స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయం ప్రస్తావించగా.. బాబూరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చైర్‌పర్సన్ సుభద్ర ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సభ్యులు బల్లలు చరిచి మద్దతు తెలిపారు. అలాగే నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని గొల్ల బాబూరావు సభ దృష్టికి తెచ్చారు. ఈ రసాయన పరిశ్రమ వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని, వారి ఆందోళనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి తాను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవ చేశానని గుర్తు చేశారు. సమావేశంలో పలు ఇతర కీలక అంశాలపై కూడా తీర్మానాలు చేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కాలేజీలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర డిమాండ్ చేశారు.

రైతుల బకాయిలు చెల్లించాలి

చోడవరం షుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను తక్షణం విడుదల చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుండా రైతులకు మొక్కజొన్న వేయమని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ చేసిన తీర్మానాన్ని చైర్‌పర్సన్ ఆమోదించారు.

అనంతగిరిలో హైడ్రో ప్రాజెక్టు వద్దు

అనంతగిరిలో హైడ్రో ప్రాజెక్టును నిలుపుదల చేయాలని జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు, చెట్టి రోష్మిణి డిమాండ్ చేశారు. అల్లూరి కలెక్టర్, ఎస్పీలు దగ్గరుండి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించడం విచారించదగిన విషయమన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్యాణి

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ కరువైందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. సెప్టెంబర్ 5న గిరిజన బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగితే ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కలెక్టర్‌కు ఆ బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. హోంమంత్రి సొంత జిల్లాలో లైంగిక దాడులు జరుగుతున్నా.. చర్యలు తీసుకునే వారు లేరని ఆరోపించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం ఎంత జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఏం చేసిందో చెప్పాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. యూరియా సరఫరా చేయడంలోనూ కూటమి విఫలమైందని ఆమె మండిపడ్డారు.

బాణసంచా తయారీలో ప్రమాదం

ముగ్గురికి తీవ్రగాయాలు



బాకి మహేష్‌రెడ్డి నగిరెడ్ల వాసు చిల్ల కనకరెడ్డి

తగరపువలస: వలందపేట రెడ్డివీధిలో అమ్మవారి మండపం వద్ద బాణసంచా తయారీలో భాగంగా శుక్రవారం రాత్రి మంటలు వ్యాపించి అదే గ్రామానికి చెందిన బాకి మహేష్‌రెడ్డి(35), నగిరెడ్ల వాసు(32), చిల్ల కనకరెడ్డి(26) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో మండపం నిర్మించి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. శనివారం అమ్మవారి నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటోంది. అందులో భాగంగా రూ.18 వేల విలువైన బాణసంచా కొనుగోలు చేశారు. ఇంకా బాణసంచా అవసరమని సొంతంగా తయారు చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం ఉపక్రమించారు. అందులో భాగంగా బాణసంచా తయారీకి అవసరమైన పొటాషియం తదితర ముడిపదార్థాలను బీరు సీసాతో నూరే క్రమంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి ఈ ముగ్గురు గాయపడ్డారు. వీరిని తక్షణం సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కనకరెడ్డికి శస్త్రచికిత్స చేయగా మహేష్‌రెడ్డి, వాసులకు సోమవారం శస్త్రచికిత్స చేయనున్నారు. ఈ ముగ్గురు స్థానికంగా ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిలో మహేష్‌రెడ్డి, వాసులకు వివాహాలు కాగా కనకరెడ్డికి ఇంకా వివాహం కాలేదు. సంఘటనా స్థలాన్ని భీమిలి సీఐ తిరుపతిరావు, తాళ్లవలస అగ్నిమాపకశాఖాధికారి జి.శ్రీనివాసరాజు సందర్శించారు.

ప్రగతిపథంలో వాల్తేరు డివిజన్

గత రికార్డులను అధిగమించినట్లు డీఆర్ఎం వెల్లడి



డివిజన్ ప్రగతి గురించి వివరిస్తున్న డీఆర్ఎం లలిత్‌బొహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ గత రికార్డులను అధిగమిస్తూ ప్రగతిపథంలో దూసుకుపోతోందని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బొహ్రా తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన ఆరు నెలల్లో(ఏప్రిల్–సెప్టెంబరు) అధిక వృద్ధిని సాధించి, గత రికార్డులను అధిగమించినట్లు వెల్లడించారు. గతేడాది కంటే రోజువారీ లోడింగ్‌లో సగటున 10.78 శాతం, సరకు రవాణాలో 12.18 శాతం అధిక వృద్ధి రేటు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సరకు రవాణాలో రోజుకు సగటున 59.6 రేక్‌ల లోడింగ్ జరిగిందన్నారు. మొత్తంగా 39.19 మిలియన్ టన్నుల సరకు లోడింగ్ ద్వారా రూ.4841 కోట్ల ఆదాయం సమకూరిందని, గత ఏడాది ఇది కేవలం రూ.4315.56 కోట్లు మాత్రమేనని తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 1.64 కోట్ల మంది ప్రయాణికులు ఒక్క విశాఖపట్నం స్టేషన్ నుంచి రాకపోకలు సాగించారని, వీరి ద్వారా సుమారు రూ.426 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ప్రయాణికుల భద్రతలో రాజీ పడకుండా.. రైల్వే భద్రతా దళం, గవర్నమెంట్ రైల్వే పోలీసుల సహకారంతో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సీసీ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసినట్లు డీఆర్ఎం తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా 22 ప్రత్యేక రైళ్లు, 3,300 అదనపు కోచ్‌లు నడుపుతున్నట్లు చెప్పారు. ఇందులో విశాఖ నుంచి నాలుగు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వివరించారు. డివిజన్ పరిధిలో మొత్తం 15 స్టేషన్లను అమృత్‌భారత్ స్టేషన్ కింద ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నామని, వీటిలో విశాఖపట్నానికి సమాంతరంగా సింహాచలం, దువ్వాడ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అరకు వంటి పర్యాటక స్టేషన్లు కూడా మరింత అభివృద్ధి చెందుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.పవన్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఎ.పి.దూబే పాల్గొన్నారు.

పాతికేళ్ల నృత్య పండగ



నటరాజ్ మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ లక్ష్మిని సత్కరిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

అబ్బురపరిచిన నటరాజ్ విద్యార్థుల నృత్యాలు

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం శనివారం కళాభారతి ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. వేడుకల్లో భాగంగా అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య, సంగీత ప్రదర్శనలు భారతీయ సంస్కృతీ వైభవాన్ని కళ్లకు కట్టాయి. వారి అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. ముందుగా విశ్రాంత ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ సదగాని రవిశంకర్ నారాయణ్, అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్, ప్రిన్సిపాల్ కె.వి.లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. గడిచిన 25 ఏళ్లలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దామని తెలిపారు. వీరిలో చాలా మంది నేడు ప్రఖ్యాత కళాకారులుగా, గురువులుగా స్థిరపడటం తమకు గర్వకారణమన్నారు. అకాడమీ కళాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి బహుమతులు, ప్రశంసలు అందుకుందని వివరించారు. అనంతరం గురువుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అకాడమీ ప్రిన్సిపాల్, నాట్యాచారిణి కె.వి.లక్ష్మిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. పాతికేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను కళల వైపు ప్రోత్సహించడమే తమ లక్ష్యమని లక్ష్మి పేర్కొన్నారు.



అలరించిన నృత్య ప్రదర్శన

రోడ్డు ప్రమాదంలో విశాఖ మహిళ దుర్మరణం

విడపనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం జిల్లా విడపనకల్లు శివారులో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైజాగ్‌కు చెందిన సుధీర్ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీలో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. అనంతపురంలో నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం అనంతపురం నుంచి సుధీర్ తన భార్య లావణ్య (34), కుమారుడు ఉదయ్‌తో కలిసి హంపికి కారులో బయల్దేరాడు. గోవా నుంచి సంజీవ్ రెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్యనాయుడు, నాగిరెడ్డి అనంతపురానికి కారులో వస్తున్నారు. విడపనకల్లు శివారులోని పెట్రోలు బంకు సమీపంలో రెండు కార్లు అదుపుతప్పి ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జవడంతో లోపల ఉన్న వారంతా కాళ్లు, చేతులు విరిగి కోమాలోకి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఉరవకొండ సీఐ మహానంది సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కార్లలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను స్థానికుల సహాయంతో అతికష్టం మీద బయటకు తీసి ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లావణ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

నేడు కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆదివారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఆదివారం రాత్రి 8.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నోవాటెల్‌కు చేరుకొని, అక్కడ బస చేస్తారు. సోమవారం పోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. సాయంత్రం 4.15 గంటలకు సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి 6.15 గంటలకు విమానంలో ఢిల్లీకి తిరిగి వెళతారు.

గాలుల బీభత్సానికి జూ విలవిల

- నేలమట్టమైన 100కి పైగా వృక్షాలు
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు



జూ క్యాంటీన్ పక్కన విరిగిన చెట్ల మధ్య పిల్లల ఆట పరికరాలు



సింహం ఎన్‌క్లోజర్‌లో కూలిన చెట్లు

ఆరిలోవ: విజయదశమి రోజున కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులు ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆ రోజు ఉదయం సంభవించిన ఈదురుగాలుల బీభత్సానికి జూలోని వందకు పైగా వృక్షాలు నేలకొరిగాయి. దశాబ్దాల నాటి సిరిసిం, టేకు, కానుగ, వేప వంటి భారీ వృక్షాలు సైతం వేళ్లతో సహా పెకిలించుకుపోయాయి. ఈ గాలుల ఉధృతికి పులుల ఎన్‌క్లోజర్ నుంచి పాముల జోన్ వరకు ఉన్న ప్రాంతంలో చెట్లు ఎక్కువగా దెబ్బతిన్నాయి. సింహాలు, కణుజులు, ఎలుగుబంట్లు ఉండే ఎన్‌క్లోజర్‌లతో పాటు, సీతాకోకచిలుకల పార్క్, క్యాంటీన్ పరిసరాల్లోని పచ్చదనం కూడా భారీగా దెబ్బతింది. కొన్ని చెట్లు మధ్యలో విరిగిపోగా, మరికొన్ని వేళ్లతో సహా కూలిపోయాయి. వృక్షాలు కూలడంతో సందర్శకుల మార్గాలు, జంతువుల ఎన్‌క్లోజర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రంగంలోకి దిగిన జూ సిబ్బంది.. ముందుగా సందర్శకుల రాకపోకలకు అడ్డంగా ఉన్న చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించి, మార్గాన్ని సుగమం చేశారు. ఎన్‌క్లోజర్‌లలో కూలిన చెట్లను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా సింహాల ఎన్‌క్లోజర్‌లో భారీ టేకు, సిరిసిం చెట్లు కూలిపోవడంతో, వాటి భద్రత దృష్ట్యా రెండు రోజులుగా సింహాలను సందర్శనకు అనుమతించడం లేదు. ఎన్‌క్లోజర్‌ను శుభ్రపరిచే పనులు పూర్తయ్యాక తిరిగి సింహాలను అనుమతిస్తామని జూ అధికారులు తెలిపారు. అదే విధంగా.. పిల్లల ఆట స్థలంలోని పరికరాలపై చెట్లు విరిగిపడటంతో, ఆ ప్రాంతాన్ని తాత్కాలికంగా మూసివేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం (18526/18525) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 31వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం–భువనేశ్వర్–విశాఖపట్నం (22820/22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 31వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం(18512/18511) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 31వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం (58528/58527)పాసింజర్‌కు ఈ నెల 31వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం (58538/58537)పాసింజర్‌కు ఈ నెల 31వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం (58532/58531)పాసింజర్‌కు ఈ నెల 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను, విశాఖపట్నం–భవానిపట్న–విశాఖపట్నం (58504/58503)పాసింజర్‌కు ఈ నెల 31వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను, విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (58506/58505) పాసింజర్‌కు ఈ నెల 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు.